సాక్షి
ప్రకాశం
సోమవారం । 3 । ఫిబ్రవరి । 2025



గైడూ లేదు..గైడెన్సూ లేదు

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్నా సంక్షేమ వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు నేటికీ ఆల్ ఇన్‌వన్ గైడ్‌లు ఇవ్వలేదు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యార్థులకు నష్టం జరుగుతోంది. - 8లో..



అధికారుల నిర్లక్ష్యానికి వృద్ధుడు బలి

ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యానికి ఓ వృద్ధుడు మృతిచెందిన ఘటన సింగరాయకొండలో చోటు చేసుకుంది. - 8లో..

గరిష్టం/కనిష్టం
32/22

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షునిగా శ్రీకాంత్

సింగరాయకొండ: ప్రకాశం జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఒంగోలుకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు కే శ్రీకాంత్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. స్థానిక ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజి ఆవరణలో ఆదివారం ప్రకాశం జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎంపిక నిర్వహించారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షునిగా ప్రధానోపాధ్యాయుడు వాకా వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా ఎన్‌టీ ప్రసాద్, కోశాధికారిగా పీడీ కందికట్ల శంకరరావును ఎంపిక చేశారు.

ఏపీజేఏసీ అమరావతి జిల్లా శాఖ చైర్మన్‌గా మధు




పిన్నిక మధుసూదనరావును అభినందిస్తున్న రెవెన్యూ అసోసియేషన్ నాయకులు

ఒంగోలు అర్బన్: ఏపీజేఏసీ అమరావతి జిల్లా శాఖ చైర్మన్‌గా పిన్నిక మధుసూదన్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక రెవెన్యూ భవనంలో ఏపీజేఏసీ జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించి మధును ఎన్నుకున్నారు. ఇప్పటికే ఆయన ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడుగా కూడా ఉన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ అసోసియేషన్ నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యవర్గం సమావేశంలో అసోసియేట్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ కందుల వెంకటేశ్వర్లు, మహిళా ఛైర్ పర్సన్ విజయలక్ష్మి, రెవిన్యూ అసోసియేషన్ సెక్రటరీ వాసుదేవరావు, ట్రెజరర్ ఊతకోలు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలుకు చెందిన ఆకాష్ నగరంలోని ఓ కార్పొరేట్ కళాశాలలో బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మీ కాలేజీలో ప్రాక్టికల్స్ చేయిస్తారా అని అడిగితే మా కాలేజీలో థియరీ మాత్రమే చెప్పారు. ప్రాక్టికల్స్ చేయించలేదు.. ఏదో మా కాలేజీలో అరకొరగా ల్యాబ్ ఉంది కానీ నేనెప్పుడూ చూడలేదు.. అని సమాధానమిచ్చాడు.

సోడియం సల్ఫేట్..బేరియం క్లోరైడ్ ఎలా ఉంటాయో తెలియదు.. వెర్నియర్ కాలిపర్స్, స్క్రూగేజీ లాంటి పరికరాలను చూసిఉండరు. ప్లాంట్ టాక్సానమీ..వానపాము, బొద్దింక అనాటమీ పరీక్షలు అసలే చేయించరు... ఇదీ ఇంటర్మీడియెట్ ప్రైవేట్ కాలేజీల విద్యార్థుల దుస్థితి. ప్రైవేటు కార్పొరేట్ కాలేజీల నిర్వాహకులు మార్కుల వేటలో పాఠ్యాంశాల బోధనకే పరిమితమై ప్రయోగాత్మక విజ్ఞానాన్ని వారికి దూరం చేస్తున్నారు. జంబ్లింగ్ విధానం రద్దుతో ప్రాక్టికల్స్‌లో తాము అనుకున్నన్ని మార్కులు వేసుకునేందుకు సిద్ధమవుతున్నారు.

పేర్నమిట్టకు చెందిన విజయశ్రీ ఒంగోలులోని ఓ కార్పొరేట్ కాలేజీలో ఎంపీసీ చదువుతోంది. విద్యార్థిని మీకు ఫిజిక్స్, కెమిస్ట్రీకి సంబంధించిన ప్రాక్టికల్స్ చేయిస్తున్నారా అని అడగగా.. మా కాలేజీలో ఇంతవరకు మాకు థియరీ మాత్రమే చెప్పారు. కానీ ప్రాక్టికల్స్ చేయించలేదని సమాధానం ఇచ్చింది.



- ఈనెల 10 నుంచి ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్ పరీక్షలు
- ప్రాక్టికల్స్‌కు జంబ్లింగ్ విధానం రద్దు
- చాలా ప్రైవేటు కార్పొరేట్ కళాశాలల్లో ప్రాక్టికల్స్ చేయించని వైనం
- ప్రయోగాలపై పట్టు కోల్పోతున్న ప్రైవేటు విద్యార్థులు
- కేవలం ప్రభుత్వ కాలేజీల విద్యార్థులకు మాత్రమే ప్రాక్టికల్స్
- ఇష్టానుసారంగా మార్కులు వేసుకుంటున్న ప్రైవేటు కాలేజీలు
- నష్టపోతున్న ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు

ప్రయోగాలు తెలియక.. పరీక్షలు రాయలేక..

ఒంగోలు సిటీ: ప్రతి విద్యార్థికి పదో తరగతి తర్వాత ఇంటర్మీడియెట్ విద్య చాలా కీలకం. ఇక్కడ వెనుకబడిపోతే జీవితాంతం చదువు మీద ప్రభావం చూపుతుంది. ఇంటర్మీడియెట్ మంచి మార్కులతో ఉత్తీర్ణులైతే మంచి భవిష్యత్తు ఉంటుంది. ప్రైవేటు ఇంటర్మీడియెట్ కాలేజీల విద్యార్థులకు పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రయోగాలు చేయించేందుకు జిల్లాలో ప్రభుత్వ కళాశాలలు 24, ఎయిడెడ్ కళాశాలలు రెండు, ఏపీ మోడల్ స్కూల్ జూనియర్ కాలేజీలు 6 ఉండగా అన్నింటిలోనూ ల్యాబులు ఉన్నాయి. హైస్కూల్స్ ప్లస్‌టు 13 ఉండగా వీటిల్లో ల్యాబులు లేవు. అందుకు అనుగుణంగా ల్యాబ్‌లు ఉన్న కాలేజీల వద్దకు వెళ్లి విద్యార్థులు ప్రయోగ పరీక్షలు నేర్చుకున్నారు. జిల్లాలో 28 కేజీబీవీలు ఉండగా 23 కళాశాలల్లో ల్యాబ్‌లు లేవు. సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ కాలేజీలు 11, ప్రైవేటు కళాశాలలు 77 ఉండగా అన్నింటిలోనూ ల్యాబ్‌లు ఉన్నాయని అధికారులు చెప్తున్నారు. తూతూ మంత్రంగా ప్రైవేటు కాలేజీలను తనిఖీ చేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. ఈ ఏడాది జనరల్ సైన్స్ ప్రాక్టికల్స్ కు ద్వితీయ సంవత్సరం చదువుతున్న 14,538 మంది సైన్స్ విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు సిద్ధంగా ఉన్నారు.



కనిగిరిలో ఏపీ మోడల్ జూనియర్ కాలేజీలో ప్రయోగశాల పరిశీలిస్తున్న ఆర్ఐఓ సైమన్ విక్టర్ (ఫైల్)

ప్రాక్టికల్స్ చేయించని ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలు..

ఇంటర్మీడియెట్‌లో సైన్స్ గ్రూపులకు చాలా డిమాండ్ ఉంటుంది. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ లాంటి సబ్జెక్టులు చదవడం కష్టం. అయినా సరే విద్యార్థులు చక్కగా చదువుకొని భవిష్యత్తులో రాణించాలనే ఉద్దేశంతో కష్టపడి చదువుతుంటారు. కానీ ప్రాక్టికల్స్ విషయంలో మాత్రం వెనుకబడిపోతారు. దానికి కారణం ప్రైవేటు కార్పొరేట్ కాలేజీలే. సరైన ప్రయోగశాలలు, పనిముట్లు, రసాయనాలు అసలే ఉండవు. కేవలం థియరీతో మాత్రమే సరిపెట్టుకొని ఆ సంవత్సరాన్ని ముగిస్తారు. తీరా ప్రాక్టికల్స్ పరీక్షలు వచ్చాక విద్యార్థులు తెల్లముఖం వేస్తున్నారు.

జంబ్లింగ్ పరీక్ష రద్దుతో ఇష్టానుసారంగా ప్రాక్టికల్స్ మార్కులు..

గత ప్రభుత్వం ప్రైవేటు కార్పొరేట్ హవాను తగ్గించింది. సైన్స్ గ్రూపులు ఉన్న కాలేజీల్లో తప్పనిసరిగా ప్రయోగశాలలు ఏర్పాటు చేసి విద్యార్థులకు ప్రాక్టికల్స్ చేయించాల్సిందిగా నిబంధనలు పెట్టింది. అంతేకాకుండా ప్రాక్టికల్స్ పబ్లిక్ పరీక్షలకు వచ్చేసరికి జంబ్లింగ్ విధానం అమలు చేసి కార్పొరేట్ ప్రైవేట్ కాలేజీల ఆధిపత్యానికి చెక్ పెట్టింది. కానీ కూటమి ప్రభుత్వం కార్పొరేట్‌కు వంత పాడటంతో వాళ్లు చెప్పినట్లే నడుచుకుంటోంది. ఈ క్రమంలో పబ్లిక్ పరీక్షలు తమ కళాశాలలో ఎవరో ఒక ఇన్విజిలేటరును వేయించుకొని వాళ్లకి నచ్చినట్టుగా మార్కులు వేయించుకొని పబ్బం గడుపుకుంటున్నాయి.



ప్రయోగాలు చేస్తున్న ప్రభుత్వ కాలేజీ విద్యార్థులు

నష్టపోతున్న ప్రభుత్వ కాలేజీల విద్యార్థులు..

ఇంటర్‌లో సైన్స్ గ్రూపులు తీసుకున్న ప్రభుత్వ కళాశాల విద్యార్థులు చాలా కష్టపడి చదువుతారు. ప్రాక్టికల్స్ మార్కులు తమ అధ్యాపకుల చేతిలో ఉండటంతో క్రమశిక్షణతో మెలుగుతారు. దీనికి తోడు సైన్స్ సబ్జెక్టుల అధ్యాపకులు ప్రయోగాలను పకడ్బందీగా నేర్పించి నిర్వహిస్తారు. థియరీతో పాటు ప్రాక్టికల్స్ కూడా దగ్గరుండి మరి నేర్పించి చేయిస్తారు. చివరిగా పరీక్షల్లో ప్రయోగాలు చేసి విద్యార్థులు విజయం సాధిస్తారు. మార్కులు 30 కి గాను 22,23,24,25,26 మార్కులు మాత్రమే అధ్యాపకులు వేస్తారు. అదే ప్రైవేటు కాలేజీలు అయితే వాళ్లకి నచ్చినట్లుగా మార్కులు వేసుకోవచ్చు. ఆరు నెలల పాటు థియరీ, ప్రాక్టికల్స్ నేర్చుకొని చేసి సాధారణ మార్కులు తెచ్చుకుంటే.. ఏమాత్రం ప్రాక్టికల్స్ చేయకుండా ప్రభుత్వ విద్యార్థుల కన్నా ప్రైవేటు విద్యార్థులు మార్కులు ఎక్కువగా తెచ్చుకుంటుంటారు. ఇప్పటికైనా వచ్చే విద్యా సంవత్సరం నుంచి అయినా ప్రతి ప్రైవేటు కార్పొరేట్ కళాశాలల్లో ప్రయోగశాలలు ఏర్పాటు చేసి జంబ్లింగ్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తే తప్ప ప్రభుత్వ విద్యార్థులకు న్యాయం జరగదు.

ఖబరస్థాన్ కథ కంచికేనా..!

ముస్లింల ఖబరస్థాన్ కథ కంచికి చేరనుంది. ఒంగోలు నగరంలో ఖబరస్థాన్‌కు కేటాయించిన స్థలాన్ని రద్దు చేసేందుకు మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం పెట్టేందుకు రంగం సిద్ధం చేశారు. ముస్లింలకు గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 2 ఎకరాల స్థలాన్ని సొంత కులానికి బహుమతిగా ఇచ్చేందుకు ముస్లింలను మోసం చేశారని ఎమ్మెల్యే దామచర్ల పై నగర ముస్లింలు మండిపడుతున్నారు.

• • •

- ముస్లింల ఖబరస్థాన్ కోసం దశరాజుపల్లి రోడ్డులో 2 ఎకరాల స్థలం కేటాయించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- ఆ స్థలాన్ని సొంత కులం కోసం రద్దు చేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్
- ఆ మేరకు 5వ తేదీ జరిగే కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేసేందుకు అజెండా సిద్ధం
- నమ్మి ఓటేస్తే నట్టేట ముంచారని రగిలిపోతున్న ముస్లింలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఒంగోలు నగరంలో 35 వేల మందికి పైగా ముస్లింలు నివసిస్తున్నారు. వీరికి కొత్తపట్నం రోడ్డులో ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద ఖబరస్థాన్ ఉంది. కేవలం 2 ఎకరాల్లో దీన్ని ఏర్పాటు చేశారు. అంతర్గత రహదారులు పోగా ఒక ఎకరం మాత్రమే మిగిలింది. ప్రతినెలా సుమారు 100 మంది వరకు ముస్లింలు చనిపోతున్నారని అంచనా. చనిపోయిన ముస్లింలకు ఈ కొద్దిపాటి స్థలంలోనే అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. తక్కువ స్థలం కావడంతో ఒకరిని పూడ్చిన చోటే మరొకరిని పూడ్చాల్సి వస్తోంది. దీంతో ముస్లింలు చాలా ఇబ్బంది పడుతున్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా మరొకచోట ముస్లింలకు ఖబరస్థాన్ కోసం స్థలం కేటాయించాలని కొన్నేళ్లుగా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ముస్లింల సమస్యను పరిగణలోకి తీసుకున్న గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం నగరంలోని దశరాజుపల్లి రోడ్డు వద్ద 2 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. కౌన్సిల్‌లో పెట్టి తీర్మానం కూడా చేసింది.

కోర్టు కేసు వెనుక దామచర్ల...

కమ్మపాలెం సమీపంలో ఉన్న దశరాజుపల్లి రోడ్డు వద్ద ముస్లింలకు శ్మశాన వాటిక కోసం స్థలం కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ కమ్మపాలేనికి చెందిన కొందరు టీడీపీ నాయకులు కోర్టులో కేసు వేశారు. దాంతో ముస్లింలు కూడా కోర్టుకు వెళ్లారు. ఈ కేసులో ముస్లింలకు అనుకూలంగా తీర్పు కూడా ఇచ్చింది. నిజానికి ఇక్కడ కేవలం ముస్లింలకు మాత్రమే స్థలం కేటాయించలేదు. హిందువులకు, క్రిస్టియన్లకు కూడా స్థలం కేటాయించారు. మిగిలిన వారికి శ్మశాన వాటిక కోసం స్థలం ఇచ్చినప్పుడు లేని అభ్యంతరం ముస్లింలకు ఖబరస్థాన్ ఇచ్చినప్పుడు మాత్రమే ఎందుకని ముస్లింలు ప్రశ్నిస్తున్నారు. అయితే కమ్మపాలెం టీడీపీ నాయకులు కోర్టులో కేసు వేయడం వెనక దామచర్ల హస్తం ఉందని ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు దామచర్ల వ్యవహరిస్తున్న తీరు ఆ ప్రచారం నిజమని నిరూపించేలా ఉందని ముస్లింలు చెబుతున్నారు.

ప్రెస్‌మీట్ పెట్టకుండా జులుం...

ముస్లింలకు ఇచ్చిన ఖబరస్థాన్ స్థలాన్ని రద్దు చేస్తున్నట్లు ఎమ్మెల్యే దామచర్ల ప్రకటించిన వెంటనే ముస్లింలలో ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. ముస్లిం ప్రజా సంఘాలన్నీ ఏకమయ్యాయి. గత మంగళవారం ఇస్లాంపేట కమ్యూనిటీ హాలులో పత్రికా సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ముస్లిం ప్రజా సంఘాల నాయకులు ప్రకటించారు. శుక్రవారం నగరంలో భారీ ర్యాలీ చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ సమాచారం తెలిసిన ఎమ్మెల్యే దామచర్ల తన అధికారాన్ని ఉపయోగించి ముస్లిం ప్రజా సంఘాలు ప్రెస్ మీట్ పెట్టకుండా అడ్డుకున్నారు. టీడీపీ ముస్లిం నాయకులను రంగంలోకి దించి గుంటూరు రోడ్డులోని ఒక రైస్ మిల్లులో రహస్య సమావేశం పెట్టినట్లు తెలుస్తోంది.



ఒంగోలులోని ముస్లింల ఖబరస్థాన్

ఈ సమావేశంలో పోలీసులు కూడా పాల్గొన్నట్టు సమాచారం. ఖబరస్థాన్ స్థలం రద్దు విషయంలో ఎవరైనా ప్రెస్‌మీట్లు పెట్టినా, పత్రికా ప్రకటనలు ఇచ్చినా వారిమీద గంజాయి కేసులు పెడతామని బెదిరించినట్లు ప్రచారం జరుగుతోంది. దాంతో ముస్లిం ప్రజా సంఘాల నాయకులు మిన్నకుండిపోయారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒంగోలులో వైఎస్సార్ సీపీకి చెందిన పలువురు ముస్లిం నాయకులను అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపించి ముస్లిం కుటుంబాల్లో భయభ్రాంతులు సృష్టించడం తెలిసిందే.

మాట ఇచ్చి మోసం చేసిన దామచర్ల...

దశరాజుపల్లి కుంట ఖబరస్థాన్ విషయంలో ఖబరస్థాన్ కమిటీ నాయకులు, ముస్లిం పెద్దలను ఎమ్మెల్యే దామచర్ల పిలిపించుకొని మాట్లాడినట్లు సమాచారం. ఖబరస్థాన్ కోసం ఇచ్చిన స్థలాన్ని రద్దు చేయనని మాట ఇచ్చినట్లు తెలుస్తోంది. తనకు కొందరు తప్పుడు సమాచారం ఇచ్చారని, దాంతో పొరపాటుగా మాట్లాడానని చెప్పినట్లు సమాచారం. ఒక వ్యూహం ప్రకారం ముస్లింల ఆగ్రహావేశాలపై నీళ్లు చల్లిన ఆయన తెర వెనుక మాత్రం ఖబరస్థాన్ స్థలం రద్దు కుట్రను కొనసాగించారు. బుధవారం జరిగే కౌన్సిల్ సమావేశంలో ఖబరస్థాన్‌కు ఇచ్చిన స్థలాన్ని రద్దు చేస్తూ తీర్మానం చేయనున్నారు. ఇప్పటికే కౌన్సిల్ ఎజెండా సిద్ధం చేసి కౌన్సిలర్లకు పంపించారు కూడా. ఈ విషయం తెలిసిన ముస్లింలు బిత్తర పోయారు. దామచర్ల తమను నమ్మించి నట్టేట ముంచారని వాపోతున్నారు. మాయమాటలు చెప్పి ముస్లింలను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కౌన్సిల్ తీర్మానం పై కోర్టు ఉల్లంఘన కేసు పెట్టేందుకు ముస్లింలు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

కలకలం రేపిన ఖబరస్థాన్ స్థలం రద్దు ప్రకటన...

జనవరి 18వ తేదీ కమ్మపాలెంలో ఎన్టీఆర్ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సభలో ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ గత ఎన్నికల్లో కమ్మపాలెం ప్రజలు తనకు అత్యధిక మెజారిటీ ఇచ్చారని, వారి రుణం తీర్చుకోలేనని చెప్పారు. కమ్మపాలేన్ని అభివృద్ధి చేస్తానంటూ అందులో భాగంగా గత ప్రభుత్వం ముస్లింలకు ఇచ్చిన ఖబరస్థాన్ స్థలాన్ని రద్దు చేస్తానని ప్రకటించారు. ఆ స్థలంలో కమ్మపాలెం ప్రజల కోసం పార్క్ ఏర్పాటు చేస్తానని చెప్పారు. త్వరలో జరిగే కౌన్సిల్ సమావేశంలో తీర్మానం పెడతామన్నారు. అంతే కాకుండా ముస్లింలను ఉద్దేశించి ''ఎవరో ముస్లింలు'' అంటూ వ్యాఖ్యానించారు. దీంతో ముస్లిం సమాజంలో కలకలం రేగింది. ఎన్నో ఏళ్ల తరబడి పోరాడి సాధించుకున్న ఖబరస్థాన్ స్థలాన్ని రద్దు చేసి పార్క్ ఏర్పాటు చేస్తానని చెప్పడంతో ముస్లింలు మండిపడుతున్నారు. ఎవరో ముస్లింలు అంటూ అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక ఎమ్మెల్యే ఇలా మాట్లాడటం తగదంటున్నారు.

అబద్ధానికి నిజరూపం చంద్రబాబే



ఫీజు పోరు వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ, నాయకులు

- విద్యార్థులను వేధిస్తున్న కూటమి సర్కార్
- విద్యార్థులకు అండగా వైఎస్సార్ సీపీ 'ఫీజు పోరు'
- 'ఫీజు పోరు' వాల్‌పోస్టర్‌లు విడుదల చేసిన బూచేపల్లి

దర్శి: ఎన్నికల ముందు అలివిగాని అబద్ధపు హామీలివ్వడం, ఇచ్చిన హామీలన్నీ ఎగ్గొట్టడం అలవాటైన చంద్రబాబు విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు కూడా ఇవ్వకుండా అబద్ధాలకు నిజరూపం అని నిరూపించుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ కార్యాలయంలో ఈ నెల 5న ఒంగోలులో నిర్వహించే ఫీజుపోరు వాల్ పోస్టర్‌లను బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరుతూ ఈ నెల 5వ తేదీ ఉదయం 11 గంటలకు ఒంగోలులోని నెల్లూరు బస్టాండ్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తామని చెప్పారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి చదువుకునే పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు రూ.3900 కోట్లు పెండింగ్ పెట్టి అవి చెల్లించకుండా చంద్రబాబు రాక్షసత్వం చూపుతున్నారన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులను ఫీజులు కట్టాలని కళాశాలల్లో ఒత్తిళ్లు చేస్తుంటే విద్యార్థులు ఫీజులు చెల్లించలేక పొలం బాట పట్టి కూలి పనులకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో ఒక్క విద్యాదీవెన, వసతి దీవెనలకే రూ.18 వేల కోట్లు ఖర్చు చేసిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అని చెప్పారు. ఇటీవల నారాయణ కళాశాలలో ఫీజులు చెల్లించలేదని ఇబ్బందులు పెడితే ఆ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన విషయాన్ని గుర్తు చేశారు. నాడు- నేడు పెండింగ్ పనులకు ఒక్క రూపాయి కూడా విదల్చకపోవడం దుర్మార్గంగా ఉందన్నారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా చేపట్టిన ఫీజు పోరు నిరసనకు జిల్లా లోని విద్యార్థుల తల్లిదండ్రులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు కొల్లా ఉదయభాస్కర్, జెడ్పీటీసీలు నుసుం వెంకటనాగిరెడ్డి, తాతపూడి రత్నరాజు, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, కౌన్సిలర్లు ఆవుల జ్యోతి, మేడం మోహన్‌రెడ్డి, తుళ్లూరి బాబురావు, మాజీ జేసీఎస్ కన్వీనర్ మేడికొండ జయంతి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కేసరి రాం భూపాల్ రెడ్డి, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి లక్ష్మిరెడ్డి, ఎస్సీసెల్ అధ్యక్షుడు జీ ఏసుదాసు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు అమీన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మంచానికే పరిమితమైనా మనసు రాలేదా..

- దివ్యాంగురాలైన పాపకు కూటమి సర్కార్ పింఛన్ కోత
- వెరిఫికేషన్ పేరుతో అనర్హత వేటు

కనిగిరిరూరల్: పుట్టు దివ్యాంగురాలు..నోటితో పలుక లేదు. చేతులు, కాళ్లు కదుప లేదు.. మంచం దిగలేదు.. అయినా అధికారులకు, పాలకుల కళ్లకు కన్పించకపోవడం బాధాకరం. సర్కారు ఆదేశాలా.. అధికారుల నిర్లక్ష్యమా తెలియదు కానీ 2009–10 నుంచి వస్తున్న హెల్త్ పింఛన్‌ను నేడు కూటమి సర్కార్ కోత పెట్టింది. వెరిఫికేషన్ పేరుతో నిర్దాక్షిణ్యంగా వేటు వేసింది. దీంతో ఆ చిన్నారికి అన్నీ తానై చూసుకుంటున్న అమ్మమ్మ ఖాజాబీ లబోదిబోమంటూ బోరున విలపిస్తూ శాపనార్థాలు పెడుతోంది. వివరాల్లోకి వెళితే.. కనిగిరి పట్టణంలోని పదో వార్డు 6వ సచివాలయం పరిధిలో నివశిస్తూ ఎస్‌కే రేష్మా కుమార్తె ఇఫ్‌రత్ తారా పుట్టు వికలాంగురాలు. పుట్టినప్పటి నుంచి అమ్మమ్మ ఖాజాబి దగ్గరే ఉంటోంది. చిన్నారికి కిడ్నీ సమస్య ఉండటంతో గతంలో ఆపరేషన్ కూడా చేయించింది. గత ప్రభుత్వంలో అప్పటి వైద్యులు చిన్నారి ఇఫ్‌రత్ తారా హెల్త్ పింఛన్ (కిడ్నీ సమస్య పింఛన్)ను మంజూరు చేసింది. అప్పటి నుంచి రూ.5 వేలు నగదు తీసుకుంటోంది. ఇటీవల ఆరోగ్య పింఛన్ పెంచి ఇచ్చిన నగదు రూ.10 వేలు కూడా తీసుకుంది. అయితే గత డిసెంబర్ నెలలో పింఛన్ వెరిఫికేషన్ పేరుతో ఒంగోలుకు పిలిపించారు. అక్కడ కొన్ని పరీక్షలు చేశారు. ప్రధాన పరీక్షలు చేయించుకుని రమ్మని గుంటూరు జీజీహెచ్‌కు పంపించారు. అక్కడ వైద్యులు మైండ్ ఆబ్సెంట్, పూర్తిగా పెరాలసిస్ బెడ్ రిడెన్ పేషంట్‌గా ధ్రువీకరణ పత్రం ఇచ్చారు. దాన్ని తీసుకుని ఒంగోలు డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో అందజేశారు. అయితే జనవరి 1న రూ.10 వేలు పింఛన్ ఇచ్చిన అధికారులు.. ఫిబ్రవరి నెల పింఛన్‌కు అనర్హతగా వేటు వేసి పింఛన్ నగదును ఇవ్వలేదు. దీనిపై చిన్నారి అమ్మమ్మ ఖాజాబీ మాట్లాడుతూ ఏ అధికారీ మా ఇంటికి వచ్చి పాపను చూడలేదని.. చూసి ఉంటే పింఛన్ ఆపేవారు కాదని వాపోయింది. కిడ్నీ సమస్య కింద పింఛన్ రాదు అని ఒంగోలు డీఎంఅండ్ హెచ్‌ఓ కార్యాలయ అధికారి నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని, కనీసం దివ్యాంగురాలి పింఛన్ కూడా ఎందుకు మంజూరు చేయలేదో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. పాపకు నెలకు మందులు, ఇతర ఖర్చులకు రూ.10 నుంచి రూ.12 వేలకు పైన అవుతుందని, పింఛన్ ఆగిపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని వాపోయింది. దీనిపై సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ మధు మాట్లాడుతూ ఇఫ్‌తారకు పింఛన్ ఆగిన మాట వాస్తవమేనని, హెల్త్ వెరిఫికేషన్‌లో డీఎంఅండ్ హెచ్‌ఓ కార్యాలయం వారు హోల్డ్‌లో పెట్టారని చెప్పారు. గతంలో ఇఫ్‌తారకు (సీకేడీ) కిడ్నీ వ్యాధి కోటాలో పింఛన్ నగదు రూ.10 వేలు ఇచ్చేవారు కానీ వైద్య పరీక్షల్లో ఆ పింఛన్‌కు అనర్హురాలని ఆపారని తెలిపారు. ఇఫ్‌రత్ తారా పూర్తిగా బెడ్‌రిడెన్ అనేది వాస్తవమని, వైద్య శాఖ ఉన్నతాధికారులు పరిశీలన చేసి వెర్షన్ మార్చి మంజూరు చేస్తారన్నారు.



మంచంలో ఉన్న ఎస్‌కే ఇఫ్ రత్ తారా

డబుల్ ఇంజన్ సర్కార్ బడ్జెట్‌లో సాధించింది శూన్యం

- మాజీ మంత్రి, పీఏసీ సభ్యుడు డాక్టర్ ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: రాష్ట్రంలోని డబుల్ ఇంజన్ సర్కార్ కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు సాధించింది శూన్యమని వైఎస్సార్‌సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి, పీఏసీ సభ్యుడు డాక్టర్ ఆదిమూలపు సురేష్ టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. బీహార్ రాష్ట్రం బడ్జెట్‌లో భారీగా అన్ని రంగాల్లో కోట్ల రూపాయల కేటాయింపులు సాధించుకుంటే మన రాష్ట్రానికి ఒక్కటంటే ఒక్కటి కూడా స్పష్టమైన కేటాయింపు దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి దిశానిర్దేశం చేయటంలో కూటమి ప్రభుత్వ పెద్దలు విఫలమయ్యారన్నారు. రాష్ట్రంలో 22 మంది కూటమి ప్రభుత్వ ఎంపీలు ఉన్నప్పటికీ ప్రయోజనం లేదని, కేంద్రం పై ఒత్తిడి తెచ్చి నిధులు రాబట్టడంలో విఫలమయ్యారని రాష్ట్రానికి న్యాయం చేయలేకపోయారని విమర్శించారు. దీనిపై ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయింపు జరుగుతుందని ఆశించినా ఆ ఊసే లేదన్నారు. జిల్లాతో పాటు రాష్ట్రంలో ఒక్క ప్రాజెక్టుకు కూడా కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో పూర్తిగా విఫలమయ్యారని, కూటమి ప్రభుత్వ పెద్దలు కూతలెక్కువ పని తక్కువ అన్న చందంగా ఉందని విమర్శించారు. వేతన జీవులకు ఇన్‌కంటాక్స్‌లో రూ.12 లక్షల వరకు వెసులుబాటు కల్పించడం మంచి పరిణామమన్నారు. అయితే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతుంటే ధరల తగ్గింపు పై ఎటువంటి చర్యలు తీసుకుంటారో స్పష్టమైన ఆదేశాలు ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వ పెద్దల నిస్సహాయతకు మారుపేరుగా నిలిచిన బడ్జెట్ అని దుయ్యబట్టారు.



ఉపాధ్యాయుడిపై లైంగిక వేధింపుల ఆరోపణలు

- సస్పెండ్ చేసి కేసు నమోదు

మద్దిపాడు: మండలంలోని వెల్లంపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు రావడంతో ఓ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ డీఈఓ కిరణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కురిచేడు మండలం కాటంవారిపాలేనికి చెందిన ఉపాధ్యాయుడు గోపనబోయిన రవికుమార్ మద్దిపాడు మండల పరిధిలోని వెల్లంపల్లి ప్రాథమిక పాఠశాలలో 2017 ఆగస్టు నుంచి పనిచేస్తున్నాడు. బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని, లైంగికంగా వేధిస్తున్నాడని ఆరోపణలు రావడంతో శనివారం కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు జిల్లా స్థాయి అధికారులు విచారణ చేపట్టారు. తుది నివేదికను కలెక్టర్‌కు సమర్పించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈఓ కిరణ్‌కుమార్ ఆదివారం మధ్యాహ్నం సదరు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేశారు. అనంతరం విచారణ అధికారులైన జీసీడీఓ హైమావతి, డీఈఓ కిరణ్‌కుమార్, స్థానిక ఎంఈఓ-2 బి.శ్రీనివాసరావు తమ విచారణలోని ఆధారాలను మద్దిపాడు పోలీస్‌స్టేషన్లో సమర్పించి ఆ ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు చేశారు. స్థానిక ఎస్సై బి.శివరామయ్య ఉన్నత స్థాయి అధికారులకు నివేదిక సమర్పించి పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు మృతి


మృతిచెందిన వెంకటశ్రీను

త్రిపురాంతకం: ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడి యువకుడు మృతిచెందిన సంఘటన త్రిపురాంతకం మండలంలోని లేళ్లపల్లిలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన గుమ్మా వెంకటశ్రీను (22) తన ఇంటి వద్ద ఉన్న ట్రాక్టర్‌ను బంధువులకు అప్పగించేందుకు వెళ్తున్న సమయంలో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ సంఘటనలో శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు. పనుల నిమిత్తం హైదరాబాదు వెళ్లిన ఆయన.. మూడు రోజుల క్రితమే స్వగ్రామానికి వచ్చాడు. అందరినీ పలకరిస్తూ సరదాగా ఉండే యువకుడి మృతితో తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుక్కల దాడిలో పది గొర్రెలు మృతి


చనిపోయిన గొర్రెలు

గిద్దలూరు రూరల్: కుక్కల దాడిలో 10 గొర్రెలు మృతిచెందగా, 4 గొర్రెలు గాయాలపాలైన సంఘటన మండలంలోని తాళ్లపల్లె గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన ఎం.చిన్నతిరుమలయ్యకు చెందిన గొర్రెల మందలో శనివారం రాత్రి కుక్కలు చొరబడి గొర్రెలపై దాడికి పాల్పడ్డాయి. ఈ సంఘటనలో 10 గొర్రెలు మృత్యువాతపడగా, మరో 4 గొర్రెలకు గాయాలయ్యాయి. ఆదివారం ఉదయం గొర్రెలను మేతకు తరలించేందుకు చిన్నతిరుమలయ్య మందలోకి వెళ్లి చూసి గమనించి విలపించాడు. సమాచారం అందుకున్న సంజీవరాయుడుపేట వెటర్నరీ డాక్టర్ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో గాయపడిన గొర్రెలకు చికిత్స చేశారు. చనిపోయిన గొర్రెల విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని, ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని గొర్రెల యజమాని కోరాడు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన కానిస్టేబుల్ మృతి


కానిస్టేబుల్ ఉగ్ర (ఫైల్)

దొనకొండ: దొనకొండ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ గత నెలలో గుంటూరు హైవేలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి గుంటూరులోనే ప్రైవేటు హాస్పిటల్లో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ బాలఉగ్ర ఆదివారం తెల్లవారుజామున 5 గంటలకు పరిస్థితి విషమించి మృతి చెందారు. మృతదేహాన్ని అతని స్వగ్రామమైన కొమరోలు మండలం పుల్లారెడ్డిపల్లి తీసుకెళ్లారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. తోటి పోలీసు సిబ్బంది, అధికారులు వెళ్లి నివాళులర్పించారు.

గైడూ లేదు.. గైడెన్సూ లేదు.!

- సంక్షేమ వసతి గృహాల్లోని పదో తరగతి విద్యార్థులకు నేటికీ అందని ఆల్ ఇన్ వన్ గైడ్‌లు
- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి సొంత జిల్లాలోనే విద్యార్థులకు అవస్థలు
- అధికారుల నిర్లక్ష్యంతో టెండర్ ఖరారు దశలోనే ఉన్న గైడ్ల ముద్రణ
- పబ్లిక్ పరీక్షలకు కేవలం 41 రోజులే ఉన్న సమయం
- కూటమి ప్రభుత్వంలో పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థులకు తీవ్ర నష్టం


ఒంగోలు అంబేడ్కర్‌భవన్ వద్ద గల సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతి గృహంలో చదువుతున్న పదో తరగతి విద్యార్థినులు

ఒంగోలు వన్‌టౌన్:

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్నాయి. పరీక్షలకు కేవలం 41 రోజులే సమయం ఉంది. కానీ, సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న పేద విద్యార్థులకు నేటికీ ఆల్ ఇన్ వన్ గైడ్‌లు అందలేదు. దీంతో కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యానికి హాస్టల్ విద్యార్థులు తీవ్రంగా నష్టపోనున్నారు. అయినప్పటికీ సంబంధిత పాలకులు, అధికారుల్లో ఏమాత్రం చలనం ఉండటం లేదు. ఇంటి వద్ద ఉండి చదువుకునే స్తోమత లేని నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల పట్ల ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి సొంత జిల్లాలోనే హాస్టల్ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతుండటం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు విద్యాధికులు కాకూడదనే లక్ష్యంతో పాలకులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

జిల్లాలోని హాస్టళ్లలో 1,679 మంది పదో తరగతి విద్యార్థులు...

జిల్లాలోని 86 ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో 1,679 మంది పదో తరగతి విద్యార్థులు చదువుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు, పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పాటు అధికారుల నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులకు సరైన విద్యా ప్రణాళిక అమలుకాలేదు. దీంతో వారి భవిష్యత్తు అయోమయంలో పడింది. ప్రైవేటు స్కూళ్లలో విద్యార్థులకు ప్రత్యేకంగా స్టడీ మెటీరియల్ ఇచ్చి ఎప్పటికప్పుడు సామర్థ్యపు పరీక్షలు నిర్వహించి తీర్చిదిద్దుతుండగా, ప్రభుత్వ వసతి గృహ విద్యార్థుల గురించి కనీసం పట్టించుకునేవారు కూడా కరువయ్యారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సకాలంలో గైడ్‌లు అందజేయడంతో పాటు పక్కాగా విద్యా ప్రణాళిక అమలు చేయగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో సరైన స్టడీ మెటీరియల్ కూడా ఇంత వరకూ అందించలేదు.

41 రోజుల్లో పరీక్షలున్నా పట్టించుకోని కూటమి ప్రభుత్వం...

పదో తరగతి పరీక్షలకు కేవలం 41 రోజులే సమయమున్నా ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో హాస్టల్ విద్యార్థులకు నేటికీ గైడ్లు అందించలేదంటే.. ఈ ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా ఉందో అర్థంచేసుకోవచ్చు. అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే పనిలో కూటమి సర్కార్ నిమగ్నమైంది. అందులో భాగంగా వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులను నిర్లక్ష్యంగా వదిలేసిందంటూ విద్యావేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, అధికారుల అలసత్వం కారణంగా హాస్టల్ విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడం గగనంగా మారనుంది. దీనిపై విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పక్కాగా 100 రోజుల ప్రణాళిక...

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వసతి గృహాల విద్యార్థులకు ప్రత్యేకంగా 100 రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేశారు. అందులో భాగంగా ముందుగానే ఆల్ ఇన్ వన్ గైడ్లను విద్యార్థులకు అందజేశారు. దీంతో హాస్టల్ విద్యార్థులు అత్యధిక శాతం ఉత్తీర్ణతతో పాటు మంచి మార్కులు కూడా సాధించారు.



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో హాస్టళ్లలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు అందించిన ఆల్ ఇన్ వన్ గైడ్‌లు

కలెక్టర్ సమావేశం నిర్వహించి నెల దాటినా ఫలితం శూన్యం...

హాస్టళ్లలోని పదో తరగతి విద్యార్థులకు 100 రోజుల విద్యా ప్రణాళిక అమలు కావడం లేదని, ఆల్ ఇన్ వన్ గైడ్‌లు అందలేదనే విషయంపై 'పది డోలాయమానం' పేరుతో సాక్షి దినపత్రికలో గత డిసెంబర్ 25వ తేదీ కథనం ప్రచురితమైంది. దానిపై స్పందించిన కలెక్టర్.. అదే నెల 27వ తేదీ సాంఘిక సంక్షేమ శాఖాధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వసతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ గైడ్‌లు వెంటనే అందించాలని ఆదేశించారు. కానీ, నెల రోజులు దాటినా ఎలాంటి ఫలితం కనిపించడంలేదు. సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మానాయక్‌లో ఏమాత్రం చలనం లేదు. జిల్లా పరిషత్ నిధుల నుంచి ప్రతి సంవత్సరం ఆల్ ఇన్ వన్ గైడ్‌లను వసతి గృహాల పదో తరగతి విద్యార్థులకు అందిస్తున్నారు. కానీ, ఈ ఏడాది అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో నేటికీ ఆల్ ఇన్ వన్ గైడ్‌లు టెండర్ ఖరారు దశలోనే ఉన్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఇప్పటికిప్పుడు టెండర్ ఖరారైనా గైడ్‌లను ముద్రించేదెప్పుడో.. విద్యార్థులకు అందించేదెప్పుడో అర్థంగాని పరిస్థితి నెలకొంది. దీన్నిబట్టి చూస్తే ఈ ఏడాది పదో తరగతి హాస్టల్ విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ గైడ్‌లు అందడం గగనమే అని తెలుస్తోంది.

> **జెడ్పీ సీఈఓ పరిశీలిస్తున్నారు :** పదో తరగతి హాస్టల్ విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ గైడ్‌ల సరఫరాకు టెండర్లు ఖరారయ్యాయి. గైడ్‌లు ఎప్పుడు వస్తాయో నాకు తెలియదు. ఈ విషయాన్ని జెడ్పీ సీఈఓ పరిశీలిస్తున్నారు.
>
> లక్ష్మానాయక్, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్

న్యాయం చేయకుంటే ఆత్మహత్యే..!

- సింగరాయకొండలో స్థల యజమాని రంగని పద్మావతి
- కలెక్టర్ స్పందించడంతో రంగంలోకి దిగిన తహసీల్దార్


కందుకూరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పద్మావతి


అక్రమ కట్టడాలంటూ జేసీబీతో కూల్చివేస్తున్న పోలీసులు, అధికారులు

సింగరాయకొండ: తన స్థలానికి న్యాయం చేయకపోతే ఆత్మహత్యే శరణ్యమని, ఆత్మహత్యకు అనుమతి ఇవ్వాలంటూ సింగరాయకొండలోని స్థల యజమాని రంగని పద్మావతి ఆదివారం సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వాధికారులను కోరారు. స్థానిక కూరగాయల మార్కెట్ సెంటర్‌లోని పెద్ద మసీదు బజారు మొదట్లో 3 సెంట్ల స్థలాన్ని రూ.50 లక్షలకు కొనుగోలు చేశానని, ఆ స్థలంలో గోడలు నిర్మిస్తే ఆదివారం తెల్లవారుజామున కొంతమంది కూల్చివేశారని, తనకు న్యాయం చేయాలని కోరుతూ పద్మావతి ఆదివారం ఉదయం తన స్థలం వద్ద టెంటు వేసి నిరాహారదీక్షకు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ నెలరోజులుగా కొంతమంది తనను కావాలని ఇబ్బంది పెడుతున్నారని, చివరికి తన స్థలంలో గోడలు కట్టుకుంటే రాత్రికిరాత్రే కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం చేయకుంటే ఆత్మహత్య చేసుకోవడానికి అనుమతివ్వాలని ప్రభుత్వ అధికారులను కోరారు. ఆమె నిరాహారదీక్ష చేస్తుండగా స్పృహ తప్పి పడిపోవటంతో వెంటనే కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స చేశారు. సెలైన్ కట్టించుకుని వచ్చి మళ్లీ ధర్నాకు కూర్చుని సోషల్ మీడియా ద్వారా పద్మావతి చేసిన అభ్యర్థన వైరల్ అవడంతో కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పందించారు. వెంటనే సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ఒంగోలు జీజీహెచ్‌కి తరలించిన తహసీల్దార్...

కలెక్టర్ ఆదేశాల మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న సింగరాయకొండ తహసీల్దార్ టి.రవి నిరాహారదీక్ష చేస్తున్న పద్మావతి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని మెరుగైన వైద్యం కోసం ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. సంఘటన స్థలంలో ఎటువంటి గొడవలు జరగకుండా ఆమె స్నేహితురాలిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పద్మావతి వద్ద ఉన్న డాక్యుమెంట్లను పరిశీలించి స్థలానికి కొలతలు వేశారు. రికార్డుల ప్రకారం ఆమెకు 2.66 సెంట్లు మాత్రమే ఉండగా, 4 సెంట్ల స్థలంలో నిర్మాణాలు ఉన్నాయని, దీని వలన మంచినీటి పైపులైనుకు ఇబ్బంది ఉందని, అదనంగా ఉన్న 1.34 సెంట్ల స్థలంలోని కట్టడాలను తొలగించాలని ఆదేశించడంతో పంచాయతీ సిబ్బంది జేసీబీతో తొలగించారు. ఆ స్థలంలో 145 సెక్షన్ కూడా అతిక్రమించారని తెలిపారు. బాధితురాలు మాత్రం తాము ఆక్రమించుకోలేదని, తమ స్థలంలోనే కట్టుకున్నామని, కొంతమంది దౌర్జన్యంగా గోడలు, రేకులు కూల్చివేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

అధికారుల నిర్లక్ష్యానికి వృద్ధుడు మృతి

- కల్వర్టు నిర్మాణానికి తీసిన గుంతలో పడి మరణించిన వైనం


కొండురత్నం మృతదేహం


మృతికి కారణమైన గుంత

సింగరాయకొండ: ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యానికి ఓ వృద్ధుడు మృతిచెందిన సంఘటన ఆదివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రంలోని కందుకూరు ఫ్లైఓవర్ నుంచి ఊళ్లపాలెం కటింగ్ రోడ్డు వరకు వేములపాడు-ఊళ్లపాలెం రోడ్డు పనులను నెలరోజుల క్రితం చేపట్టారు. అందులో భాగంగా శ్రీరాంనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సమీపంలో కల్వర్టు నిర్మాణానికి గుంతలు తీశారు. పనులు ప్రారంభించి నెలరోజులకుపైగా అయినప్పటికీ నత్తనడకన జరుగుతున్నాయి. ఈ కల్వర్టు వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డులూ ఏర్పాటు చేయలేదు. ఈ క్రమంలో శనివారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వెళ్తున్న తన్నీరు కొండురత్నం (65) ప్రమాదవశాత్తూ కల్వర్టు నిర్మాణం కోసం తీసిన గుంతలో పడి మరణించాడు. ఆదివారం ఉదయం మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నేరాల నియంత్రణపై దృష్టి పెట్టండి

- ఐజీ త్రిపాఠి



రికార్డులు పరిశీలిస్తున్న ఐజీ త్రిపాఠి, పక్కన ఎస్పీ దామోదర్

మార్కాపురం: నేర నియంత్రణ, పెండింగ్ కేసులపై పోలీసు అధికారులు దృష్టి పెట్టాలని గుంటూరు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదేశించారు. ఆదివారం మార్కాపురం డీఎస్పీ కార్యాలయాన్ని ఎస్పీ దామోదర్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌తో కేసులు ఛేదించాలన్నారు. పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాల కట్టడికి గట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాంతి భద్రతల విషయంలో రాజీపడవద్దన్నారు. గతంలో నమోదైన కేసులు, ఎస్సీ, ఎస్టీ, పోక్సో కేసుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులను క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌తో ఛేదించి నిందితులకు శిక్ష పడేలా చూడాలన్నారు. పాత నేరస్తులపై నిఘా ఉంచాలని, మహిళలు, చిన్న పిల్లలపై జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. శాంతి భద్రతల నియంత్రణ, పరిరక్షణ, నేర నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్ అవసరమన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వాడకం ద్వారా కలిగే దుష్ప్రభావాలు, చట్టపరమైన చర్యలు, సైబర్ నేరాలపై ప్రజలు, విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. సీసీ కెమేరాల ప్రాముఖ్యతను వివరించి అందరూ ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో గౌరవంగా వ్యవహరించాలని, ఫిర్యాదులు స్వీకరించి జవాబుదారీగా ఉండాలని, విధి నిర్వహణలో వృత్తి నైపుణ్యాన్ని పెంచుకుంటూ ప్రజలకు మెరుగైన పోలీసింగ్ సేవలు అందించాలని ఐజీ సూచించారు. అనంతరం సబ్‌డివిజన్‌లో నమోదైన వివిధ రకాల కేసుల రికార్డులు, క్రైం రిజిస్టర్లు, రివ్యూ రికార్డులను పరిశీలించి పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో మార్కాపురం డీఎస్పీ నాగరాజు, సీఐలు సుబ్బారావు, మల్లికార్జున, రామకోటయ్య, సురేష్, ప్రభాకర్‌రావు, ఎస్సైలు సైదుబాబు, అంకమరావు, రాజమోహన్ రావు, రవీంద్రారెడ్డి, కోటేశ్వరరావు, మహేష్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధే లక్ష్యం

- జిల్లా ఆవిర్భావ దినోత్సవంలో మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి
- కలెక్టర్, అధికారులతో కలిసి ప్రకాశం పంతులు విగ్రహానికి నివాళులు


టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యేలు

ఒంగోలు అర్బన్: ఎటువంటి పరిస్థితులు ఉన్నా జిల్లాను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి తెలిపారు. ప్రకాశం జిల్లా 56వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఒంగోలులోని ప్రకాశం భవనంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. తొలుత కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ప్రకాశం పంతులు విగ్రహానికి మంత్రితో పాటు కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయ్‌కుమార్, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, టూరిజం చైర్మన్ బాలాజీ, అధికారులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో బాల్యవివాహాల నివారణతో పాటు శిశు మరణాలు తగ్గించనున్నట్లు తెలిపారు. సీటిపారుదల, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి చేసి జిల్లా నుంచి వలసలు తగ్గించడంపై దృష్టి సారించామన్నారు. యువతకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలో కందుకూరు నియోజకవర్గం ప్రకాశం జిల్లాలో కలుస్తుందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ విజన్-2047లో రాష్ట్ర ప్రభుత్వం ప్రధానంగా ప్రస్తావించిన పది సూత్రాలను పరిగణలోకి తీసుకుని ఆ కోణంలో జిల్లాను అభివృద్ధి చేస్తామన్నారు. మాల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ విజయ్‌కుమార్, వ్యవసాయ కార్పొరేషన్ వైస్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్‌ఓ చిన ఓబులేసు, ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీప్రసన్న, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులతో పాటు వివిధ రంగాల్లో ప్రతిభ చాటి జిల్లా ఖ్యాతి పెంచిన పలువురిని సత్కరించారు. ముందుగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

గంట ఆలస్యంగా దామచర్ల.. ఎదురుచూసిన మంత్రి, కలెక్టర్

జిల్లా అవతరణ దినోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ గంటకుపైగా ఆలస్యంగా వచ్చారు. దీంతో ముఖ్య అతిథిగా వచ్చిన మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామితో పాటు కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఇతర ప్రముఖులు ఎదురుచూస్తూ గడిపారు. ప్రతి కార్యక్రమానికి దామచర్ల ఆలస్యంగా వస్తుంటారని, కానీ, మంత్రి, కలెక్టర్ పాల్గొనే కార్యక్రమానికి కూడా ఆలస్యంగా వచ్చి ముఖ్య అతిథులు సైతం వేచి ఉండేలా చేయడం ఏంటని పలువురు విమర్శిస్తున్నారు.

పింఛన్ల నగదు అప్పగింత

మార్కాపురం టౌన్: పట్టణంలోని 18వ సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగి (ఎమినిటీ సెక్రటరీ) పి.వెంకటేశ్వర్లు పింఛన్లు పంపిణీ చేయాల్సిన 2.66 లక్షల రూపాయలతో శనివారం నుంచి కనిపించకుండా పోయిన విషయం విధితమే. అయితే, అతని తరఫున అతని తల్లిదండ్రులు ఆదివారం ఉదయం ఆ మొత్తాన్ని మార్కాపురం మున్సిపల్ అధికారులకు అందజేశారు. ఈ విషయాన్ని పట్టణ ఎస్సైకి, మున్సిపల్ కమిషనరుకు తెలియజేశారు. ఆ నగదుతో వార్డులోని పింఛనుదారులకు పింఛన్లను సిబ్బంది పంపిణీ చేశారు.